# ఓయి, కవీ!
# కవిత్వం వ్రాయి!

*

## బోయి భీమన్న

* *

అఖిల భారత తెలుగు రచయితల
ఐదవ మహా సభలలో
కవి సమ్మేళన అధ్యక్ష పీఠం
నుంచి

భాగ్యనగరం 31—5—1971

ఓయి కవీ !
కవిత్వం వ్రాయి !
జీవితాన్ని మథించు
భావ లతలు పూయించు,
అందాలను ఆనందంతో నింపి
అందరికీ అందించు ! 1

కవి అనేవాడు కావ్య వ్యవసాయి,
మానవ హృదయం కావ్య మధుపాయి;
ఎవర్నో విమర్శించడం కాదోయి !
ఎలనీరే ఎండలకు మందోయి ! 2

ఒక్కొక్క జిహ్వకు ఒక్కొక్క రుచి
ఒకొక్క పుర్రెకు ఒకొక్క బుద్ధి;
ప్రతి జిహ్వనూ, ప్రతి పుర్రెనూ లాలించగలది
కవిత్వం ఒక్కటేనోయి ! 3

మేము నీనుంచి ఆశించేది-
చీకటిని కాదు, వెన్నెలను,
ఉద్రేకాన్ని కాదు, ఉపశాంతిని,
రక్తపాతాన్ని కాదు, రక్తి ప్రభాతాన్ని. 4

నీతులు చెప్పకయ్యా ! కవీ !
నీకు తెలిసిన నీతులు మాకూ తెలుసు;
వేదాంతం బోధించకు,
ఆ మాత్రం ఎరగనివా డెవడూ ఇక్కడ లేడు. 5

మా దారికి, మా తిండికి ఎవరైనా అడ్డంవస్తే
మా దగ్గర కత్తులున్నై, శక్తులూ ఉన్నై;
నీ కలం నరకడానికి పనికిరాదయ్యా !
ఆమ్రఫలం ఆటంబాంబు కాలేదయ్యా ! 6

గోవు గడ్డి తింటుంది
వ్యాఘ్రం మాంసం తింటుంది,
మనిషి గోముఖ వ్యాఘ్రమయ్యా, బాబు !
అర్థం చేసుకోవయ్యా మనీషి డాబు ! 7

తన తిండికి మరొకడు పోటీ రానంతకాలం
మనిషి మనీషిగా నీతులు చెపుతాడు,
పోటీ ఏదైనా అగుపిస్తే చాలు–
అశ్వత్థామ నైనాసరే హతః అంటాడు ! 8

ఏ జీవుడి స్వభావమైనా ఇంతే-
ప్రేయసికి పారిజాతం తెస్తాడు,
ప్రత్యర్థి గుండె నెత్తురు తాగుతాడు,
స్వప్రయోజనం కోసం సహచరినైనా వదిలేస్తాడు. 9

సృష్టిలో మానవుడు తలెత్తి నప్పటి నుంచీ
చూస్తున్నావు కదా అతడి మనో నైజాన్ని?
వీరులు, ప్రవక్తలు, అవతార మూర్తులు
ఎవరైనా మార్చగలిగారా మనిషిని? 10

కవికూడ మనిషేనయ్యా !
మనిషిని మరో మనిషి మార్చలేడయ్యా !
నీవద్ద నిజంగానే కవితామధు వుంటే
కొసరవయ్యా అదేదో మాకు కూడ ! 11

యుగే యుగే పుడుతున్న దేవుడి నన్నవాడు కూడ
ఏ కొందరు దుష్టులనో చంపగలిగాడే తప్ప
దౌష్ట్యాన్ని తుంపగలిగాడా ఇప్పటికీ ?
నరుడు నరుడేనయ్యా ఎప్పటికీ ! 12

మానవ ప్రకృతి మహితాత్మక మనుకొని,
మానవ నైజాన్ని అపార్థం చేసుకొని,
మానవ ప్రవర్తనను నిందిస్తున్నావా, కవీ ?
పంకం లేకుండా పంకజం ఉంటుందా, కవీ ? 13

గురి తప్ప మరేదీ కనిపించలే దర్జునుడికి,
ఆ గురే తారక మంత్రమయింది లోకానికి,
కళగా ఆరాధిస్తేనే ఏదైనా
కల్యాణ ప్రదమవుతుంది జనానికి. 14

ఇంటి భోజనం పేదవాడి ఇంటిదైనా
హోటలు భోజనం కంటె ఉత్తమం;
నీ కవితను నీ కోసమే సృష్టించుకో !
నీలో విశేషముంటే, అవుతుందది విశ్వజనీనం ! 15

మట్టిముంతలు, రజత పాత్రలు, రత్న చషకాలు
అన్నీ ప్రజల కోసమే, వారి సుఖం కోసమే;
ప్రధానం ప్రక్రియలు కావు–
వాటిలో నీ వందిస్తున్న మధు రసాలు. 16

మా రైతులు చుట్టలు కాలుస్తారు
మా కార్మికులు బీడీలు కాలుస్తారు
మా ఆఫీసర్లు సిగరెట్లు కాలుస్తారు
అందరూ ప్రజలే, అభిరుచులే వేరు! 17

కళ ప్రజలకోసం అనడం
అన్నం తినడం కోసం అనడమే ?
రాజకీయ నినాదాల రోజు లివి,
రాజీపడవద్దు వాటితో ! 18

కళ ప్రజల కోసమే,
పందుల కోసం కాదు;
సిటీలో రిక్షా లాగుడూ కళే,
సినీమాలో సెక్సువాగుడూ కళే. 19

తెలుగు సినీమా పలుగు పాటలు వద్దయ్యా !
శ్రావ్య కంఠాలకు సంగీతాన్ని ఎరగా గ్రుచ్చి
సెక్సును సొమ్ము చేసుకొంటున్న గాలా లవి !
యువకులను చెట్టెక్కిస్తున్న వాలా లవి ! 20

కిరాయి నటుడి ఫొటోకు ఫ్రేము కట్టించి
పూజగదిలో అలంకరించుకొనే జాతి
కవితను కమర్షియలైజు చెయ్యగలదు,
సరస్వతిచేత కచేరీలే చెయ్యించగలదు ! 21

కవీ ! నీవు అమ్ముడు పోవద్దు,
భక్తి రంజని పేరుతో సెక్సురంజని పాడొద్దు,
రాజకీయాల ప్రాపకం కోరొద్దు,
రక్తం వెల్లువలైనా రాగవీణ మానొద్దు. 22

వేద, వేదాంత, కావ్య పురాణాదులకు
టీకలు, తాత్పర్యాలు, భాష్యాలు కూడ వ్రాయి !
నీ కవిత్వంలోకి మాత్రం వాటిని దించకు,
మూల ఋషికి తోకలు తగిలించకు ! 23

వాల్మీకి శ్లోకం నీ పద్యం కంటె సరళం,
కాళిదాసు డెందం నీ కందం కంటె సరసం,
సూటిగా తీసుకువెళ్ళు వారిని ప్రజలవద్దకు,
బంధించకు వారిని బండిరాల బళ్ళకు 24

మల్లెతీగ తుపాకిగుళ్లు పూయదు,
తేనెటీగ విషాన్ని సేకరించదు,
కోకిల కోడిపుంజులా పోరదు,
మృగశిర లావా వర్షించదు. 25

అందుకే నయా, ఓయి కవీ !
నీవు నిజంగా కవివే అయితే-
నిజంగా కవిత్వం వ్రాయి !
నినాదాలు మానెయ్యి ! 26

తాను తృప్తిగా తినేవాడు సహృదయుడు,
మిగిలితే ప్రజలకు పంచేవాడు కవి !
నీవు తినగా మిగిలేది ఎంత ?
మాకు పంచగలిగింది ఎంత ? 27

అందాలకు నిలయాలు
నందన బృందావనాలే కాదు
మా కూలీల వాలు కొప్పుల్లో కూడ
మందారాలు పరవశిస్తై. 28

మనిషి స్వార్థపరుడయ్యా !
బలం కలవాడిదే రాజ్యం,
తన స్వప్రయోజనానికి లోబడి నట్టివే
దయ, దైవం, భక్తి, నీతి ! 29

పేద, ధనికుడు, అధికారి, సేవకుడు-
వంటి తేడాలన్నీ కేవల రాజకీయ మైనట్టివి,
ఏదో ఒక పక్షం వహించకయ్యా, కవీ !
అందరూ గుండెలనిండా కోరికలున్న వాళ్ళే ! 30

నీ కవితా మధువును అందరికీ పంచు,
అందరి గుండెబలాన్నీ పదిలంగా పెంచు,
గుండె బలమే అన్ని పాపాలకూ పరిష్కారం,
గుండెబలమే సుఖశాంతుల శోభనాగారం. 31

నీ వే దృష్టితో చూస్తే
ఆ రూపంలో కనిపిస్తుంది నీకు సృష్టి,
ఆరాధనకు కనిపించేది అందం,
ఆకలికి కనిపించేది ఆరటం ! 32

భూమి నుంచి పుట్టేది కవిత్వం,
కార్ఖానాల నుంచి పుట్టేది పాండిత్యం,
ప్లాస్టిక్ పువ్వుల్ని చూచి భ్రమసిపోకు
ఎంత చిన్నదైనా నీ తోటపని నీవు మానకు ! 33

ఒకడు కిటికీలు మూసుకొని పడుకొంటాడు,
ఒకడు ఆరుబైట వెన్నెల్లో విరహిస్తాడు,
ఒకడు పాతాళానికి ప్రవహిస్తాడు,
ఒకడు చంద్రగోళానికి ఎగిరిపోతాడు. 34

మనిషి – తనచుట్టూ ఉన్న మనుషులతో,
పరిసరాలతో, పరిస్థితులతో సమరసంగా
మెలగుతూ, బ్రతుకుతూ, వర్ధిల్లుతూ ఉంటాడు;
సమస్యలు ఎవడివి వాడివే ఎల్లప్పుడూ ! 35

రాజకీయాలు, భజనలు, ఉపన్యాసాలు, తీర్మానాలు
మనిషిని ముంచేస్తున్న దుర్దినా లివి;
వ్యక్తి, సంఘం, దేశం – దేనికైనా సరే
స్వప్రయోజన మొక్కటే ప్రత్యక్ష దైవం ! 36

పదవీ రాజకీయాలు
పచ్చికలో పసిరి పాములు;
కవి పాములవాడు కావచ్చు,
తానే ఒక పాము కారాదు. 37

రాజకీయాల రభసల నడుమ
తిండిపేట త్రిప్పల నడుమ
చిట్లిన చిత్తాలను అతకలేనిది
కళా కాదు, కవితా కాదు. 38

ఉల్లి పువ్వూ పచ్చడికే-
మల్లి పువ్వూ పచ్చడికే కాదు,
కంకర రాయీ విసరడానికే-
కమలాఫలమూ విసరడానికే కాదు. 39

నేటి తెలుగు సాహిత్యంలో ఎటుచూసినా
పురిటి గదులు, శ్మశానాలు, తిట్లు
ముళ్ళు, మురికి, నల్లులు, పిల్లులు
ఇంతే కదా అని ఈసడించుకోకు. 40

మాటకు నూరు అర్థాలు,
పాటకు వేయి రాగాలు,
తోటకు లక్ష కుసుమాలు,
కూటికి కోటి విద్యలు ! 41

వ్రాయనీ ప్రతి మొండి కలాన్నీ,
పాడనీ ప్రతి మూగి కంఠాన్నీ,
ఏ కలంలో కల్ప వృక్షాలు ఫలిస్తాయో !
ఏ గొంతులో మాణిక్య వీణలు రవిస్తాయో ! 42

సాహిత్యానికి దేశ కాలాలు లేవు,
సరస్వతి నిత్య యౌవని, సనాతని,
ఆనాడు కంచిపట్టు చీరలు కట్టింది,
ఈనాడు నైలాన్ సిల్కువోణీలు వేస్తున్నది ! 43

చమత్కారాలు, అంత్యప్రాసలు, విమర్శలు
ఉంటే ఉండవచ్చు ఔచిత్యానికి లోబడి;
అయితే -- అవి మాత్రమే కవిత్వం కాదు,
అసలు అందం ఉంటే అలంకారాలు అక్కరలేదు 44

మానవుడు తన అప్పటి స్థాయి నుంచి
ఉన్నత స్థాయి కోసం యత్నిస్తూ ఉంటాడు,
ఆతని స్థానంలో నీవు నిలబడి చూడు !
చేతనైతే సానుభూతితో తోడ్పడు ! 45

దేనికీ మారని విలువలు లేవు,
నీతి నియమాలు మనిషి సృష్టించుకొన్నవే,
నీకు వినా దేవుడు కూడ మరొక లేడు,
మనిషిని తిట్టకు, మంచిగా మరొక మెట్టెక్కించు ! 46

సమాజం వికసించింది, మానవుడు ఫలించాడు,
సామాన్య మానవుడే విశ్వ మానవుడైనాడయ్యా !
కీలు గుర్రాలతో కర్రకత్తులతో కుర్రకుంకలా
నీ వింకా కంకరలో ఆడుకొంటున్నావా, కవీ ? 47

నిన్ను చూచి పెద్దవాళ్లు నవ్వుతున్నారు !
రాజకీయ నాయకులు నీ ముఖమే చూడకున్నారు !
ఒక సినీ ఎగ్రస్టా గోటి కున్న విలువైనా
నేడు నీ కున్నదా ? గుండెపై చేయివేసుకు చెప్పు ! 48

సమాజానికి రసభావ సౌందర్య దాతవు
సమైక్యానికి సాక్షాత్ పరమేశ్వరుడవు,
త్యాగానికి దధీచివి, అగరు వత్తివి, జటాయువువు,
ఎందు కవుతుందయ్యా బ్రతుకు నీకు బరువు ? 49

నీవేదో చెప్పాలనుకొంటున్నావా ?
దాన్ని గురించి పూర్వం ఎవరేమి చెప్పారో తెలుసుకొన్నావా ?
కొత్తగా నీవు చెప్పవలసిం దుంటేనే చెప్పు !
పాత సీసాలకు కొత్త లేబుళ్ళు అతికించకు ! 50

కాలం విమానంలా దూసుకుపోతున్నది,
సంఘం సముద్రాలు దాటిపోతున్నది.
యాత్రికులు కోరేది శ్రమను మరిపించే నవత !
అందుకు పనికిరాకపోతే మరెందుకు నీ కవిత ? 51

కవుల పేర్లు దాచేసి, కవితల్ని మాత్రం ప్రకటిస్తే–
నేటి కవిత లన్నీ ఒకటే మోడలుకు కాపీలు !
తన అసమర్థతకు మరెవర్నో నిందిస్తున్నాడు ఆధునికుడు !
నిస్పృహా వద్దు నిజ స్థితిని గుర్తించు ! 52

జీవితాన్ని నలుముఖాలుగా అనుభవించు,
అనుభవం నుంచి ఆనంద సుధను వెలయించు,
కుల మత ముఠాలకు అతీతంగా జీవించు,
తెలుగుకు మూలసాహిత్య భాగ్యాన్ని కలిగించు. 53

ఎండ వానల దాంపత్యం ఈ జీవితం,
రెంటికీ సమంగా గొడుగు పట్టగలిగిందే సాహిత్యం !
చిమ్మ చీకటిలో చిరుదీపమైనా కావాలి నీ పాట !
మరింత చికాకు కల్పించే కారు మబ్బు కారాదు నీ బాట ! 54

❋ ❋ ❋

## COMPLETE WORKS OF BOYI BHIMANNA VOL - 3 : VACHANA KAVITHALU PART - 1

### డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు

1. సంపుటి - 1 - భీమన్న గేయ కావ్యాలు : భాగం 1 & 2
2. సంపుటి - 2 - భీమన్న పద్య కావ్యాలు : భాగం 1 & 2
3. సంపుటి - 3 - భీమన్న వచన కవితలు : భాగం 1, 2 & 3
4. సంపుటి - 4 - భీమన్న వచన గ్రంథాలు : భాగం 1 & 2
5. సంపుటి - 5 - భీమన్న నాటకాలు : భాగం 1 & 2
6. సంపుటి - 6 - Works of Boyi Bhimanna
7. సంపుటి - 7 - భీమన్న అముద్రిత రచనలు
8. సంపుటి - 8 - భీమన్న పీఠికలు : భాగం 1 & 2

### ఇతర రచనలు :

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమవతీ భీమన్న
2. భీమన్న సాహితీ షష్టి పూర్తి సంచిక - సంపాదకుడు : శ్రీ గనుమల జ్ఞానేశ్వర్
3. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - (సదస్సు పత్రాలు)
4. బోయి భీమన్న నాటకాలు - సార్వజనీనత - (సదస్సు పత్రాలు)
5. బోయి భీమన్న సాహిత్యం - వర్తమాన సమాజానికి సందేశం (సదస్సు పత్రాలు)
6. బోయి భీమన్న రచనలు - కావ్యతత్వ వివేచన (సదస్సు పత్రాలు)